# నగ్న సత్యం

-ఎ.కె.వి.రత్నమాల

కోరికలు అనంతాలు, పునరావృతాలు. దుఃఖానికి హేతువులు. నిజమే. ఎన్నాళ్లయినా తీరని కోరికలు మనుషుల పాలిట దెయ్యాలు. మనసుల్ని పట్టి పీడించే పిశాచాలు. వీటన్నిటికీ కారణం డబ్బు. ఆ ఒక్కటీ ఉంటే చాలు కానిదిలేదు. ఆలోచిస్తుంటే నీరసం ముంచుకొచ్చింది. పక్కమీద వాలాను. అశాంతి రేగింది. లేచి కూర్చున్నాను. ఆరాటంగా అనిపించింది. పచార్లు ప్రారంభించాను.

మళ్ళీ నాలో ఆందోళన, అలజడి మొదలయ్యాయి. 'అసలు వీటన్నిటికీ కారణం ఒక్కటే డబ్బు. ధన మూల మిదం జగత్' అనుకుంటుంటే ఎవరో పగలబడి నవ్వినట్టనిపించింది. చుట్టూ చూసాను.

ఎవరూలేరు. డబ్బుంటే చాలు కానిదిలేదు. మళ్ళీ అనుకుంటుంటే మళ్ళీ నవ్వు. నిశితంగా గమనిస్తే అప్పుడర్థమయింది నవ్వుతున్నది నా అంతరాత్మేనని.

"ఎందుకు నవ్వుతున్నావు?'' ఉక్రోషంగా అడిగాను.

"నీ ఆలోచనలకి.''

"ఇప్పుడు నేనేమంత తప్పుగా ఆలోచించాననీ?'' నా ప్రశ్న.

"నీ ఎదురింటి వాడి పెళ్లాం ఆమె మొగుడి కింద పని చేసే ఓ చిన్న ఉద్యోగితో లేచిపోయింది. ఎందుకో తెలుసా?'' అంతరాత్మ ప్రశ్న.

పరిస్థితులరీత్యా డబ్బు చుట్టూ పరిభ్రమిస్తున్న నా ఆలోచనలకీ, ఎదురింటి వాడి పెళ్లాం ఎవరితోనో వెళ్లిపోవడానికీ మధ్యగల సంబంధమేమిటో అర్థం కాలేదు నాకు.

ఆ మాటే అడిగాను "దానికీ దీనికి ఏమిటి సంబంధం?'' అని.

"చాలా వుంది. బాగా ఆలోచించు.'' అంతరాత్మ సమాధానం అది.

నా సమస్యలే నాకు సరిపోవట్లేదు. వాటికి సాయం మళ్ళీ ఇదొకటా? అనుకున్నాను. విసుగ్గా అనిపించింది.

తలుపు తీసుకుని బయటకు వచ్చాను. వచ్చీ రాగానే వినిపించింది ధబ్ అన్న చప్పుడు.

ఉలిక్కిపడ్డాను.

ఆ అదిరిపాటుకి ఆలోచనలు చెదిరిపోయాయి. మళ్ళీ 'ధబుక్...ధబుక్' ఆ శబ్దం పక్క రూంలోంచి. పక్కవాడు పిడికిలి బిగించి తన పెళ్లాన్ని గుద్దుతున్నాడు.

విషయం అర్థం కాగానే నోరంతా చేదులా అయిపోయింది.

'భగవంతుడా! ఎటుపోతున్నారు వీళ్ళు?' అనుకుంటుంటే మనసంతా బాధతో నిండిపోయింది.

నిజానికి వాళ్లిద్దరూ మూడేళ్లపాటు ప్రేమించుకున్నారు. ఆ ప్రేమ చాలా గాఢమైందని అర్థం కాగానే పెద్దల్ని ఎదిరించి మరీ పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన మూడునెలలకే ఒకరికొకరు శత్రువుల్లా మారిపోయారు.

మూడేళ్లపాటు ఒకర్ని విడిచి మరొకరు ఉండలేనంతగా సాగిన ప్రేమ, పెళ్లయిన మూడునెలలకే అంతరించిపోవడానికి కారణం డబ్బేనని తెలుసుకున్నారు.

అన్నీ తెలిసినా ఏం చేయలేని పరిస్థితి. ఇప్పుడు వాళ్ళ అవసరాలకి సరిపడ డబ్బుంటే వాళ్ల మధ్య ఈ కీచులాటలూ, తన్నులూ, గుద్దులూ ఉండకపోను అనుకుంటుంటే మనసులో గునపాలు గుచ్చినట్టయింది.

తల విదిలించి ముందుకు నడిచి పిట్టగోడ దగ్గరికి చేరుకున్నాను.

అక్కడ్నుంచి పక్కింటి కాంపౌండ్ స్పష్టంగా కనిపిస్తోంది. ఆ కాంపౌండ్‌లో డెబ్బయి ఏళ్ల వృద్ధురాలు చేతులు సాచి గాల్లో తడుముకుంటూ ఆ ప్రక్కగా వున్న టాయ్‌లెట్స్‌వైపు అడుగువేస్తోంది.

"వెధవ సంత. ఈ కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు అంతా నా నెత్తినే. మాటలూ ముచ్చట్లూ మీ ఇంట, మాపటి భోజనాలు మా ఇంట అన్నట్లు ఇవ్వాల్సిందంతా వాళ్లకీ వీళ్లకీ ఇచ్చేసి కాళ్లు చేతులు ఒంగాక చాకిరీ చేయించుకోవడానికి మాత్రం నా ఇంటికొచ్చిపడింది.

ఏళ్లొచ్చాయ్. ఏం లాభం? కొంచెమైనా న్యాయం, ధర్మబుద్ధి లేకపోయాకా?'' తడుముకుంటూ నడుస్తున్న వృద్ధురాలిమీద కూతురు సూటిపోటి మాటల వర్షం కురిపిస్తోంది.

చూస్తుంటే జాలేసింది నాకు. సరిగ్గా ఏడాది క్రితం అనుకుంటాను. ఆ ముసల్ది తన కూతురు ఇంటికి వచ్చింది.

వచ్చిన కొత్తల్లో చూపు బాగా ఉండడం మూలంగా అటూ ఇటూ తిరిగేది. మనవలకి స్నానాలు చేయించడం, అంట్లు తోమడం, బట్టలు తకడంలాంటి పనులన్నీ చేసేది. మధ్యమధ్య తీరిగ్గా వరండాలో కూర్చున్నప్పుడు మాత్రం కూతుర్ని అడుగుతుండేది

'నా కంటికి ఆపరేషన్ ఎప్పుడు చేయిస్తావు? చూపు సరిగ్గా ఆనడంలేదు' అని. బహుశా కేటరాక్ట్ అనుకుంటాను. 'చేయిస్తాలే. కంగారేం వుంది?' అనేది కూతురు.

అలా రాన్రానూ చూపు మందగించి అస్సలు కనబడడం కూడా పోయింది.

మరోసారి పరిశీలనగా చూసానా ముసలావిడని. ఎలాగైతేనేం వెతుక్కుంటూ టాయ్‌లెట్ దగ్గరకు చేరుకుంది.

అది కాదు సంగతి. వచ్చినప్పుడు మెళ్ళో చంద్రహారం, చేతికి నాలుగు జతల గాజులతో నిండుగా వున్న ఆవిడ ఇప్పుడు మాత్రం మెళ్లో చవకబారు పూసలదండ, చేతులకి రోల్డ్‌గోల్డ్ గాజులతో హీనంగా కనిపిస్తోంది.

అంటే కూతురు బంగారమంతా తీసేసుకుని కూడా తల్లికి కంటి ఆపరేషన్ చేయించడానికి వెనుకాడుతోంది.

చిన్నప్పట్నుంచీ ఎన్నెన్నో కష్టాలుపడి ఇంకెన్నో త్యాగాలు చేసి కని పెంచిన తల్లిపట్ల ఆ కూతురు వ్యవహరిస్తున్న తీరుకి నాకు కోపం, అసహ్యం ఒక్కుమ్మడిగా కలిగాయి.

"ప్చ్! అందుకే అన్నారు పుట్టిన క్షణం నుంచీ చచ్చే నిముషంవరకూ డబ్బుండాలి అని. డబ్బుంటే చాలు కానిదిలేదు అనుకుంటుంటే మళ్ళీ అంతరాత్మ వికటాట్టహాసం.

'అన్నిటికీ కారణం, మూలం కేవలం డబ్బేకాదు. ఇంకా చాలా ఉంటాయి. అన్ని పన్లూ డబ్బుతో అవుతాయనుకోవడం మూర్ఖత్వం' వికటంగా నవ్వుతూ అంది అంతరాత్మ.

'షిట్! వెధవ కబుర్లు చెప్పకు. డబ్బుని మించినదేదీ లేదీ లోకంలో.

భూమి గుండ్రంగా ఉంది. కాసు కూడా గుండ్రంగానే వుంటుంది.

భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతుంది. భూమ్మీద మనుషులు కాసుల చూట్టూ తిరుగుతారు.

ఏమీ లేకుండా మనిషి పుడతాడు. ఏమీ లేకుండానే పోతాడు. కానీ పుట్టుకకీ, చావుకీ మధ్యలో అన్నీ ఉన్నాయి. అందమైనవి వున్నాయి, అందనివి వున్నాయి. అన్నీ కావాలంటే అందుకు కావలసింది ఒకే ఒక్కటీ డబ్బు.

అంతెందుకు? చదువు కావాలన్నా, ఉద్యోగం రావాలన్నా, ప్రేమ నిలవాలన్నా, పెళ్లి కావాలన్నా, కొడుకులు ఆదరించాలన్నా, కూతుళ్లు తల్లిదండ్రుల్ని తమ ఇంటికి పిలవాలన్నా, దొంగతనాలు తగ్గాలన్నా, దోపిడీలు అంతమవ్వాలన్నా, వరకట్నం చావులు సమసిపోవాలన్నా, ఓ కుటుంబం బావుండాలన్నా, ఓ దేశం ముందుకు పోవాలన్నా డబ్బుండాలి. డబ్బు జబ్బుకాదు. ఎలాంటి జబ్బునయినా తగ్గించేదే డబ్బు. ఎస్ మనీ మేక్స్ మెనీ థింగ్స్.

ఇప్పుడు ఈ పక్కనున్న ప్రేమ జంట కొట్టుకునీ, తిట్టుకునీ ఒకర్నొకరు చంపుకోవడానికి సిద్ధపడ్డారంటే అందుకు కారణం డబ్బే. ఆ తల్లి కూతురు చేతిలోనే గుడ్డిదయిందంటే అందుకు కారణం కూడా డబ్బే'' ఆవేశంగా, ఆవేదనగా నేను ఊగిపోతుంటే నా ధాటికి తట్టుకోలేక కాబోలు అంతరాత్మ మౌనం వహించింది.




ఇంట్లోంచి బయటకొస్తే చాలు డబ్బులేక అన్యాయమైపోయిన వాళ్ళు, డబ్బు కోసం గడ్డి కరిచే వాళ్ళూనూ. విసుగ్గా అనిపించింది నాకు. మనిషిగా పుట్టేకంటే మానై పుట్టడం మేలని అనను. ఏ పక్షిగానో, జంతువుగానో పుట్టి వుంటే ఈ బాధ్యతలూ, బాదరబందీలూ ఏవీ వుండేవికావు అని అనుకోను. కానీ ఉత్తమమైన మనిషి జన్మ ఎత్తి కేవలం ఏవో కొన్ని కారణాలవల్ల ఈ జీవితాన్ని అనుకున్నంత అందంగానూ, ఆనందంగానూ గడపలేకపోతున్నామన్నదే నా బాధంతా.

అందుకే ఏ సమస్యలు ఎదురయినా వాటిని శాయశక్తులా ఎదిరించడానికే ప్రయత్నిస్తుంటాను తప్ప అడ్డదిడ్డమైన ఆలోచనే అసలు రానివ్వను.

ఆలోచిస్తుంటే నా ధోరణికి నాకే నవ్వొచ్చింది. నవ్వుకున్నాను. నిజమే.

అనుకూల పరిస్థితుల్లో రాజీపడడంకన్నా ఆ పరిస్థితుల్ని ఎదిరించాలి, అదుపులోకి తేవాలి.

మనకి అనుకూలంగా మలచుకోవాలి అనుకోవడమే కదా అసలు సమస్య. అలా అనుకున్న క్షణం నుంచీ మొదలవుతాయి ఆరాటాలూ, పోరాటాలు, ఆందోళనలు, ఉద్వేగాలూ అన్నీ.



## తారగణి అందం

కొంతమంది తారలకి వయసు మీద పడుతున్నా అందంలో ఎలాంటి మార్పూ కన్పించదు. మొన్నామధ్య రాజ్యసభకి నామినేట్ అయినప్పటినుంచీ హేమమాలినికి అప్పుడే రాజకీయం అబ్బినట్టుంది. మొన్నామధ్య పత్రికల వారితో మాట్లాడినప్పుడు ఈ విషయం స్పష్టమైంది. 'బాగ్ బన్' చిత్రం తరువాత ఆమె ఇప్పుడు తన దృష్టిని బుల్లితెరపై నిలుపుతున్నట్టుంది. సహారా టీవీ ఈ డ్రీంగర్ల్‌ని ప్రధాన పాత్రధారిణిగా పరిచయం చేస్తూ సరికొత్త ధారావాహికని త్వరలో ప్రసారం చేయనుంది. 'పెద్దతారలకి బుల్లితెర ఎంతో అనువుగా ఉంటుంది. ఎందుకంటే కెమేరా ముందుకెళ్లడం వారికేం కొత్తకాదు. అన్నట్టు బుల్లితెర నాకేం కొత్తకాదు' అంటోంది హేమ. రవిచోప్రా దర్శకత్వం వహిస్తున్న ఈ సీరియల్‌లో హేమ ఇంకా అందంగా దర్శనమివ్వబోతుందంటున్నారు.

తెల్లారి లేచిన దగ్గర్నుంచీ ఉన్న కాస్త డబ్బునీ అన్ని అవసరాలకి ఎలా సర్దాలనే ఆలోచనే. అనుకోకుండా ఒక్క చిన్న ఖర్చు వచ్చి పడితే నెలాఖరులో ఎలా? అన్న భయమే. ప్రతి పైసా చూసి చూసి ఆచితూచి ఖర్చు పెట్టాలంటే బుర్ర పగలగొట్టుకున్నంత బాధే.

అయినా తప్పదు. ఏదీ తప్పదు. బాధను భరించలేక బాధ్యతని ఒడిలేసినా కష్టాన్ని ఎదిరించలేక దాన్నుంచి దూరంగా పారిపోవడానికి ప్రయత్నించినా సమస్య మరింత జటిలమవుతుంది.

అలా కాకూడదంటే అన్నిటికీ తట్టుకుని నిలబడాలి. అసలు ఇవన్నీ ఇలా సంభవించడానికి కారణం డబ్బు.

ఆ డబ్బే అవసరాలకి సరిపడా ఉంటే ప్రతి చిన్న

విషయానికీ ఆందోళన ఉండదుగా. అందుకే నేను అనుక్షణం దాని గురించే ఆలోచిస్తాను. ప్రతి క్షణం ఆ ఒక్కటి చాలు కానిదిలేదు అనే అనుకుంటాను.

నా ఆలోచనలు పూర్తిగా సరైనవేనని నమ్ముతాను కూడా.

ఆలోచిస్తుంటే హఠాత్తుగా పిచ్చెక్కినట్లనిపించింది. ఇంటికి తాళంవేసి రోడ్డున పడి నడక ప్రారంభించాను.

దారి పొడుగునా జనం, జనం. అమ్మేవాళ్ళు, కొనేవాళ్ళు, వాళ్ళనీ వీళ్ళనీ కళ్లు విప్పార్చుకుని చూసేవాళ్ళూను.

అమ్మేవాళ్ళు ఉన్నదానికి రెట్టింపు ధర చెబుతున్నారు. కొనేవాళ్ళు అసలు ధరకి సగం తగ్గించి అడుగుతున్నారు. రూపాయి దగ్గర ఆలోచన, అర్ధ రూపాయికి బేరం.

పావలా దగ్గర కక్కుర్తి. సాధ్యమైనంత ఎక్కువ లాభాలు ఆర్జించాలన్నది అమ్మేవాడి ఆలోచనైతే, సాధ్యమైనంత తక్కువ ఖర్చుపెట్టి ఎక్కువ మిగుల్చుకోవాలన్నది కొనేవాడి ఆశయం. అందరి తాపత్రయం, అంతిమ ధ్యేయం ఒకటే. అనతి కాలంలోనే ఎక్కువ సంపాదించేయడం.

వాళ్లకీ తెలుసు. డబ్బుంటే చాలు, కానిదిలేదు అన్న నిజం ఆలోచిస్తుంటే మరోసారి కూడా చాలా బలంగా అనిపించింది నేనే కరెక్ట్ అని. ఆ మాట మనసులో అనుకునే లోపు-

"అయ్యోయ్యో పడిపోతున్నాడు పట్టుకోండి...పట్టుకోండి'' అన్న అరుపు. అంతులేని ఆందోళన.

వెనక్కి తిరిగి చూసాను. అరవయ్యేళ్ళ పెద్దమనిషి నిలుచున్నవాడు నిలుచున్నట్టే నడిబజార్లో కుప్పకూలిపోయాడు.

ఎవరో పట్టుకున్నారు. ఇంకెవరో నీళ్లు తెచ్చి మొహాన కొట్టారు. మరెవరో తాగడానికి కూల్‌డ్రింక్ అందించారు.

క్షణాల్లో జనం పోగయ్యారు. చుట్టూ గుంపు, మధ్యలో అతను.

"ఏమైందో ఏమో?''

"ఇసుంటి మడుసులు ఒంటరిగా రాకూడదు.''

"ఏడికి బోవాల్నో?''

"ఇల్లు ఇక్కడికి దగ్గరో కాదో...'' ఇలా అందరిదీ తలో మాట.

ప్రతి మాటలోనూ అతని గురించి తెలుసుకోవాలన్న ఆరాటం.

అతనికి ఏదో చెయ్యాలన్న తాపత్రయం. కానీ వాళ్ళందరికీ సమాధానం చెప్పడానికి అతనసలు స్పృహలోలేడు.

"హాస్పిటల్‌కు తీసుకువెళ్లండి'' గుంపులోంచి ఎవరిదో సలహా.

"త్వరగా వెళ్లండి'' మరెవరిదో సమర్థింపు.

"అందుకు డబ్బు కావాలిగా'' అంతదాకా స్పృహతప్పిన పెద్దమనిషి తలని ఒళ్లో పెట్టుకుని ఉపచారాలు చేస్తున్నతని నసుగుడు అది.

తల తిప్పి చుట్టూ చూసాను. ఒక్కక్షణం ఎవరూ ఏమీ మాట్లాడలేదు. బహుశా కొద్దిసేపట్లో అక్కడ్నుంచి ఒక్కొక్కరే జారుకుంటారేమో అనిపించింది.

ఆ సీన్ కోసమే ఎదురు చూస్తున్నంతలో అనూహ్యంగా ఓ చేయి పైకి లేచింది.


"ఇదిగో. ఈ వంద తీసుకుపో. ఆయన్ని హాస్పిటల్‌లో చూపించు'' సలహా ఇచ్చిన స్వరమే సహాయంచేసే చెయ్యిగా మారుతూ చేసిన శాసనమది.

ఆ వెంటనే మరో పది చేతులు పైకి లేచాయి. ఇరవై...యాభై... పాతిక..క్షణాల్లో డబ్బులు పోగుపడ్డాయి.

అదిచూసి తక్షణం మరో నలుగురు ముందుకొచ్చారు.

ఆటో వచ్చింది. స్పృహ తప్పిన పెద్దమనిషి హాస్పిటల్‌కు తరలించబడ్డాడు. అతి దగ్గర్లోనే ఉంది. నా కాళ్ళు అప్రయత్నంగా అటు దారి తీసాయి.

పావుగంటలో అక్కడికి దారి తీసాయి. వెళ్ళేసరికి ఆ పెద్దమనిషి స్పృహలోకొచ్చాడు. కేజువల్ వార్డ్‌లో అతనికి సెలైన్ పెడుతున్నారు. పక్కనే ఇందాక ఆయన్ని హాస్పిటల్‌లోకి తీసుకొచ్చిన నలుగురూ ఉన్నారు. తిన్నగా వాళ్ళ దగ్గరికి నడి



చాను.

"ఏమన్నారు డాక్టర్? ఎలా వుంది ఆయన పరిస్థితి?'' ఆరా తీసాను వాళ్ళని.

"జనరల్ వీక్నెస్ అన్నారు. ఇంకాస్సేపట్లో ఆయనకి సంబంధించిన వాళ్ళు కూడా రావచ్చు'' చెప్పాడు వాళ్లల్లో ఒకతను.

వింటుంటే ప్రాణం తేలికపడ్డట్టయింది. హాయిగా నిట్టూర్చాను.

వస్తూ వస్తూ దారిలో కొన్న పళ్ళు, బ్రెడ్డూ ఆయనకి అందించి వెనక్కి తిరుగుతుంటే "ఆగు'' అరిచింది అంతరాత్మ.

ఆగాను.

"ఎందుకొచ్చావిక్కడికి?'' అడిగింది.

"ఆయన్ని చూద్దామని.''

"అందువల్ల నీకొచ్చే లాభమేమిటి?''

"ఆత్మసంతృప్తి.''

"అదికాదు నేనడిగేది. నీ లాభం ధన కనక వస్తువుల్లో ఏ రూపంలో వుంటుందని.''

ఛెళ్ళున చరిచినట్టయింది.

అంతరాత్మ ప్రశ్నకి సమాధానం చెప్పలేకపోయాను. నా మౌనం చూసి అంతరాత్మ నవ్వింది చిన్నగా, మృదువుగా.

"మనిషికి డబ్బు అవసరమే. కానీ సుఖ సంతోషాలతో జీవించడానికి ఆ ఒక్కటే చాలదు. ఓ మనిషి ప్రాణాప్రాయంలో వున్నప్పుడు అతన్ని ఆదుకోవడానికి, అతని ప్రాణాలు కాపాడడానికి ముందు మానవత్వం కావాలి. మంచితనం ఉండాలి. ఈ రెండింటి తర్వాతే డబ్బు. ఎదుటి మనిషి బాధల్లో ఉంటే చూసి జాలిపడడానికి ముందు మనసు కావాలి. ఆ తర్వాతే మనీ.

ఇద్దరు మనుషులు జీవితాంతం కలసి ఉండడానికి వాళ్లిద్దరి మధ్య మొదట అవగాహన ఉండాలి. ఆ తరువాత ప్రేమ ఉండాలి.

ఆ పిమ్మటే డబ్బు. తల్లిదండ్రులకీ, బిడ్డలకీ మధ్య సత్సంబంధాలు ఉండాలంటే మొదట ఆ ఇరుపక్షాలకీ కుటుంబంపట్ల విలువ, గౌరవం, మంచి అభిప్రాయం ఉండాలి. ఆ తరువాత కుటుంబ సభ్యులపట్ల ఆప్యాయత ఉండాలి. ఆ పిదపే డబ్బు. ఓ వ్యక్తి ఓ పని చేయాలంటే మొదట ప్రయత్నం ఉండాలి. పట్టుదల కావాలి. వీటన్నిటికీ ఆత్మవిశ్వాసం తోడవ్వాలి.

ఆ తర్వాతే డబ్బు. నీ పక్కింటి మొగుడూ పెళ్లాం కొట్టుకు చావడానికి కారణం డబ్బు కాదు. ఆప్యాయత కరువడడం. నీ కళ్లెదుట తిరుగాడుతున్న ఓ తల్లి నిర్దాక్షిణ్యంగా గుడ్డిదవడానికి కారణం డబ్బు కాదు. ఆదరణ లేకపోవడం. ఆఖరికి నీ చిరాకులకి, పరాకులకీ కారణం డబ్బు కాదు. నీ భావోద్వేగాలు నీ అదుపులో లేకపోవడం. మనిషి జీవితంలో అడుగడుగునా డబ్బు అవసరమే.

కానీ అన్నీ డబ్బుతోనే అవుతాయనుకోవడం మూర్ఖత్వం.

అంతెందుకూ? కొన్ని కోట్లు గుమ్మరించినా మృత కళేబరానికి ప్రాణం పోయగలరా? కొన్ని లక్షలు వెచ్చించినా గడిచిన నిముషాన్ని కొని తీసుకురాగలరా?

కొన్ని వేలు పోసినా మనశ్శాంతిని కొనుక్కోగలరా? డబ్బు కావాలి. కానీ ఆ ఒక్కటీచాలు, కానిది లేదు అన్న అభిప్రాయం మాత్రం వద్దు. నిజం చెప్పాలంటే మనిషిని పరుగులెత్తించేది డబ్బు కాదు.

నైజం. అందిన దానితో తృప్తిపడక, అందనిదానికై అర్రులు చాచే చపలత్వం. ఎదురుగా వున్న దాన్ని విస్మరించి ఎక్కడో ఉన్నదాని గురించి, అసలు సాధ్యంకాని దాని గురించి చేసే ఆలోచనలే మనిషికి మనశ్శాంతిని ఉండనివ్వవు.

కోరికలు అనంతాలు. పునరావృతాలు. దుఃఖహేతువులు.

ఇంకా చెప్పాలంటే కోరికలు గుర్రాలు. రెక్కలొచ్చిన పక్షులు. నిజమే. కానీ ఆ గుర్రాల తాలూకు కళ్ళాలు మన చేతిలోనే వుండాలి. పక్షులు పగల్లా ఎక్కడెక్కడో తిరిగినా సాయంత్రానికి మనం ఏర్పాటుచేసిన పంజరంలోకి చేరుకునే తర్ఫీదును మనమే ఇవ్వాలి. అప్పుడు కోరికలు దుఃఖహేతువులు కాదు.

అభివృద్ధికి మొదటిమెట్లు. ఇదే జీవిత సత్యం. ఈ నగ్నసత్యాన్ని మర్చిపోని మనిషే మనశ్శాంతితో మనగలుగుతాడు. కాదంటావా?'' అంతరాత్మ నిలదీసి అడుగుతుంటే నేను సిగ్గుతో తలొంచుకున్నాను.

నిజమే!

తరచి చూస్తే మానవ జీవితం సుఖశాంతులతో నడవడానికి ఏ ఒక్కటీ చాలదు. అన్నీ కావాలి. ఆశ ఉండాలి. కానీ నిరాశ, దురాశ కూడదు. ప్రయత్నం చేయాలి.

ఫలితం సఫలమైనా విఫలమైనా నిస్పృహ చెందకూడదు.

డబ్బుండాలి. కానీ అదే సర్వస్వం అనుకోరాదు.

అప్పుడే జీవితంలోని ఆనందాన్ని అనుభవించగలం అన్న నగ్నసత్యం మొట్టమొదటిసారిగా ఆ క్షణంలోనే అర్థమైంది నాకు.

★

## ఆస్తమాని పెంచే ధూమపానం

ఆస్తమాతో ఉక్కిరిబిక్కిరయ్యే వారు ధూమపానానికి దూరంగా ఉండాలని బ్రిటిష్ సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. యూనివర్శిటీ ఆఫ్ గ్లాస్గోకి చెందిన పరిశోధకులు ఆస్తమా వ్యాధిగ్రస్తుల్ని పరీక్షించి వారిలో ధూమపానం అలవాటున్నవారికి వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉందని తేల్చారు. 16 నుంచి 44 సంవత్సరాల మధ్య వయసున్న ఆస్తమా రోగుల్ని పరీక్షిస్తే వారిలో 40శాతం మంది ధూమపాన ప్రియులని కనుగొన్నారు. ఉబ్బస వ్యాధిగ్రస్తులు మందులు వాడడం ఎంత అవసరమో, తమకున్న ధూమపాన అలవాటును త్యజించడం కూడా అంతే అవసరం అని వారు సలహా ఇస్తున్నారు. ఆస్తమాతో బాధపడేవారు ధూమపానానికి బానిసలయితే మరింత ఎక్కువ ప్రమాదమని వారంటున్నారు.

## సంతానాన్ని నియంత్రించే కాలం

కాలమే అన్నిటికి సమాధానం చెబుతుందంటారు పెద్దలు. అది నిజమే అని తేలింది. ఎందుకంటే సంవత్సరంలో కొన్ని మాసాల్లో జననాల రేటు అధికంగా ఉంటుంది. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన బయాలజిస్ట్ విర్పీ లుమ్మా కొంతమంది కెనడా మహిళలపై పరిశోధన చేసి కొన్ని ఆసక్తిదాయకమైన విషయాన్ని వెల్లడించారు. అవేమంటే శీతాకాలంలో పుట్టిన అమ్మాయిలకు వేసవికాలంలో పుట్టినవారి కంటే గర్భధారణ శక్తి తక్కువగా ఉంటుందని తేలింది. మరో ఆసక్తి కల్గించే అంశమేమిటంటే వేసవికాలంలో జన్మించిన వారికి ఎక్కువమంది మనుమలు, మనవరాళ్ళు కలుగుతారని లుమ్మా చెబుతున్నారు. ప్రొసీడింగ్స్ ఆఫ్ రాయల్ సొసైటీకి అందజేసిన ఒక పరిశోధనా పత్రంలో ఆమె ఈ వివరాలు వెల్లడిచేశారు.

-శ్రీనివాస్

